సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



టెన్త్ పరీక్షలకు..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై కలెక్టర్ సమీక్షించారు. ఏర్పాట్లపై ఆదేశాలు ఇచ్చారు.

- 8లో



వైభవంగా నిర్వహిద్దాం

అరసవల్లి రథ సప్తమి ఉత్సవంపై సమీక్ష జరిగింది. ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

- 8లో

ఐఎస్‌డీపీ సహాయ సంచాలకులుగా యోగేశ్వరరావు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమగ్ర గొర్రెల అభివృద్ధి పథకం (ఐఎస్‌డీపీ) సహాయ సంచాలకులుగా డాక్టర్ బమ్మిడి యోగేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటివరకు పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులుగా రాగోలు పశువైద్యశాలలో పనిచేశారు. ప్రమోషన్ రావడంతో సంచాలకుల కార్యాలయంలో సహాయ సంచాలకులుగా విధుల్లో చేరారు. దీంతో కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

మీ అవినీతికి వంశధారే సాక్షి

- పాతపట్నంలో దోచుకుతిన్న టీడీపీ నాయకులు
- అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా అక్రమాలు
- వైఎస్ జగన్ అధికారంలో వచ్చాకే అభివృద్ధి పరుగులు

ప్రాజెక్టు కోసం రైతులు భూములిస్తే వారి పరిహారాన్ని ఫలహారంలా తినేశారు. తీరంలో నది మేట వేస్తే అక్కడ తిష్ట వేసి ఇష్టానుసారం మేత మేశారు. రిజర్వాయర్ పేరు చెప్పి నదీ గర్భం నుంచి ఇసుక ఎక్కడెక్కడికో తరలించారు. నిర్వాసితుల పునరావాసాన్ని కూడా వదలకుండా బినామీల పేరుతో బొక్కేశారు. పాతపట్నంలో టీడీపీ నాయకులు సాగించిన ప్రతి అక్రమానికి వంశధారే సాక్షి. పార్టీ ఫిరాయింపు నుంచి ఇసుక తరలింపు వరకు, అబద్ధపు హామీల నుంచి బినామీలతో అక్రమాల వరకు టీడీపీ నేతలు చేయని దోపిడీ లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే వీరి ఆగడాలు ఆగాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : అధికారం దక్కింది అక్రమాల కోసమే అన్నట్టు ఆ ఐదేళ్లు టీడీపీ నేతలు పాతపట్నంలో బరి తెగించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారీతిన ఇసుకను తవ్వేశారు. వంశధార పరిహారం ముసుగులో బినామీ పేరిట కోట్లు కొల్లగొట్టారు. నీరు–చెట్టు పేరుతో కోట్లాది రూపాయలు స్వాహా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాకే పాతపట్నం మళ్లీ కొత్త వెలుగులు చూసింది. సీఎం వైఎస్ జగన్ చొరవతో ఆ నియోజకవర్గం ప్రస్తుతం కుదుట పడింది. రాష్ట్రంలో తలసరి ఆదాయం అత్యంత తక్కువగా ఉన్న నియోజకవర్గం పాతపట్నం. ఆ పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు శతథా ప్రయత్నించారు. గిరిజన గూడలకు దారులతో పాటు నిర్వాసితులకు అదనపు పరిహారం వంటి పనులెన్నో చేశారు. రూ. 216కోట్లకు పైగా అదనపు పరిహారం అందజేశారు.



చినబాబూ.. మీ మోసాలివే..

- హిరమండలం మండలంలోని కల్లట–జిల్లేడుపేట గ్రామాల మధ్య మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం హామీలకే పరిమితమైంది. మజ్జిగూడేం వద్ద సుమారు రూ.10కోట్లు ఖర్చుతో ఎత్తిపోతల పథకం పనులు శిలా విగ్రహంలా మిగిలిపోయాయి.
- వంశధార నిర్వాసితులకు చెల్లించే పరిహారంలో బినామీల పేర్లతో అక్రమాలు చేశారు. విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారు.
- పాతపట్నం నియోజకవర్గంలో ఉన్న వంశధార, మహేంద్ర తనయ నదుల నుంచి ఇసుకను ఇష్టానుసారం దోచేశారు. వరదల కారణంగా వంశధారలో మేట వేసిన పొనుటూరు, మాతల వద్ద నాటి ఫిరాయింపు ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కనుసన్నల్లో అక్రమ తవ్వకాలు జరిగాయి.
- పొలాల్లోని ఇసుక తొలగించి అమ్ముకునేందుకు అనుమతి కావాలని రైతుల పేరుతో కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవడం, అధికారం అండతో అనుమతులు పొంది పొలాల్లోని మేటను వదిలేసి ఇసుకను అక్రమగా తోడేసిన దాఖలాలు ఉన్నాయి.
- వంశధార రిజర్వాయర్ నిర్మాణ అవసరాల పేరిట హిరమండలంలోని భగీరథపురం, పిండ్రువాడ, అక్కరాపల్లి, అంబావలి, రుగడ కొమనాపల్లి తదితర గ్రామాల నుంచి ఇసుకను బహిరంగంగా తరలించారు. కరకట్టల ముసుగులో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు.
- వంశధార నిర్వాసితుల కోసం నిర్మించిన ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో అక్రమంగా బినామీల పేరుతో భూములు కొట్టేశారు.

వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి





కాగువాడ-రొమదల వంతెన

- ఐటీడీఏ నిధుల నుంచి రూ.21కోట్లను మంజూరు చేసి 18 గిరిజన గ్రామాలకు రోడ్లు వేశారు. రూ.27.02 కోట్లతో పంచాయతీరాజ్ పరిధిలోని 11 రోడ్లను నిర్మించారు. రూ.14.50 కోట్లతో ఆర్ అండ్ బీ రహదారులు వేశారు.
- 30 గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా కాగువాడ–రొమదల గ్రామాలకు మహేంద్రతనయ నదిపై రూ.6.95 కోట్లు ఖర్చుతో వంతెన, రూ.2 కోట్లు ఖర్చుతో రోడ్డు నిర్మించారు.
- పాతపట్నం సామాజిక ఆస్పత్రిని రూ.4.20 కోట్లతో బాగు చేశారు.
- కొత్తూరు మండలంలో రు.50 కోట్లతో 33కేవి సబ్‌స్టేషన్ నిర్మించారు.
- కొత్తూరులో రూ. 2 కోట్లతో పోలీస్ స్టేషన్ నిర్మించారు.
- పాతపట్నం మేజర్ పంచాయతీని పీడిస్తున్న విద్యుత్ సమస్య పరిష్కారానికి రూ.93 లక్షల ఖర్చుతో 15 కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.
- పాతపట్నంలో రూ..4కోట్లతో మరో సీహెచ్‌సీ నిర్మించారు.
- మెళియాపుట్టిలో రూ.12 కోట్లతో ఏకలవ్య పాఠశాల నిర్మించారు.
- కొత్తూరులో రూ.56 లక్షలతో అగ్రిల్యాబ్ నిర్మించారు.
- రూ.700 కోట్ల ఖర్చుతో ఉద్దానంకు తాగునీరు అందించే హిరమండలం వంశధార జలాశయం వద్ద రక్షిత తాగునీటి పథకం పనులు చేపట్టారు.
- పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాలకు వంశధార నుంచి నీరందించేందుకు రూ.265 కోట్లు మంజూరు చేశారు.
- రైతులకు సాగునీరందించేందుకు హిరమండలం వద్ద రూ.168 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మిస్తున్నారు.
- గత ప్రభుత్వం వంశధార నిర్వాసితులకు చేసిన అన్యాయాన్ని చక్కదిద్దేలా రూ.216.72 కోట్ల మేర అదనపు పరిహారం చెల్లించారు.
- ఎల్.ఎన్.పేట మండలం తురకపేట గ్రామంలో మండలానికి రెండో ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి మంజూరు చేశారు.
- ఎల్ఎన్‌పేటలో బీసీ హాస్టల్ భవనం నిర్మించారు. ప్రభుత్వ ఆస్పత్రిని బాగు చేశారు.

ఇచ్ఛాపురంలో గెలుస్తున్నాం

- వైఎస్సార్ సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో ప్రసంగిస్తున్న పార్టీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

కంచిలి, సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజారిటీతో గెలుస్తుందని ఆ పార్టీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోంపేట మండలంలోని బారువ బీచ్ రిసార్ట్‌లో నియోజకవర్గ ముఖ్య నేతలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. కిడ్నీ పరిశోధన కేంద్రం, వైఎస్సార్ సుజలధార ఇచ్ఛాపురం కోసమే పూర్తి చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గం పరిధిలో అన్ని కులాలకు పదవులు ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఇక్కడి ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని తెలిపారు. గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల గౌరవాన్ని నిలబెట్టేది జగనన్న మాత్రమేనని చెప్పారు. నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ మాట్లాడుతూ పార్టీ నేతలందరి సహకారంతో రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తామని అన్నారు. వైఎస్సార్ సీపీలా నిరంతరం ప్రజల్లో ఉండే పార్టీ మరొకటి లేదన్నారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యేతోపాటు, శ్రీకాకుళం ఎంపీ సీట్లను గెలిచి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా ఇద్దామన్నారు.



సమావేశానికి హాజరైన ముఖ్య నేతలు, కార్యకర్తలు

అనంతరం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మాట్లాడుతూ పదేళ్ల నుంచి రామ్మోహన్‌నాయుడు తండ్రి పేరు చెప్పుకొని గడిపేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలు వినే పరిస్థితిలో ప్రజలు లేరని తిలక్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు గెలిచేందుకు పార్టీ క్యాడర్ అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అన్ని వర్గాలను సముచితంగా గౌరవించిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియను సమర్థంగా చేపట్టాలంటే బూత్ కన్వీనర్లు, మరో ఇద్దరు సభ్యుల పాత్ర కీలకమని అన్నారు. వీరిని త్వరలో నియమించి, దిశానిర్దేశం చేశారు. ఇచ్ఛాపురంలో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామ ని కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా(లల్లూ), రాష్ట్ర సీడాప్ కార్పొరేషన్ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయరావు, ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు లాభాల స్వర్ణమణి, ఉలాల భారతి దివ్య, కవిటి మండల నేత కడియాల ప్రకాష్, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, జేసీఎస్ కన్వీనర్లు కొణపల సురేష్, బుద్ధాల శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ది మూర్ఖత్వమే

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



లుకలాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: నోరు విప్పితే అబద్ధాలు తప్ప నిజాలు మాట్లాడలేని టీడీపీ నాయకుడు నారా లోకేష్ నిజంగా మూర్ఖుడేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. లోకేష్ నిప్పు కాదు, టీడీపీకి పట్టే తుప్పు అని దుయ్యబట్టారు. మండలంలో 14 గ్రామాల్లో రూ. 12.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా లుకలాం, నడగాం, ఉర్లాంలో మాట్లాడుతూ.. లోకేష్‌ను తీవ్రంగా విమర్శించారు. లోకేష్ పగటి కలలు కంటున్నారని, రానున్న ఎన్నికల్లో కూడా మీ ఆశలు నెరవేరవని అన్నారు. ఎన్నికల పేరుతో మేనిఫెస్టోలు విడుదల చేసే నైతికత టీడీపీకి లేదన్నారు. సందుసందునా బెల్టు షాపులు పెట్టి ప్రజల ఒళ్లు గుల్ల చేసింది టీడీపీ కాదా అని ప్రశ్నించారు. 'నరసన్నపేటలో నువ్వు నిర్వహించిన సభకు కూత వేటు దూరంలో గడ్డెయ్యపేట వద్ద 900 ఇళ్ల నిర్మాణం అయ్యాయి.. ఒక్క ఇల్లూ కట్టలేదని అన్నావ్. మీ పార్టీ నాయకులను అడుగు.. వాళ్లయినా వాస్తవాలు చెబుతారేమో.. లేదా నువ్వు వస్తానంటే నేనే స్వయంగా చూపిస్తా..' అంటూ దుమ్మెత్తిపోశారు. 'నీలా.. నీ తండ్రిలా అడ్డదారుల్లో అధికారానికి వచ్చి మోసం చేసే వ్యక్తిత్వం నాది కాదు.. నా గురించి ప్రజలను అడుగు చెబుతారు' అంటూ మండిపడ్డారు. ఉత్తరాంధ్ర నుంచి శంఖారావం పేరుతో లోకేష్ చేస్తున్న యాత్ర టీడీపీ శవ యాత్ర అని కృష్ణదాస్ అభివర్ణించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్పందనకు 220 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 220 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్ రావు, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్ విజ్ఞప్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులపై వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రూపొందించిన డైరీని ఆ సంఘ నాయకులు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కేఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, జెడ్పీ సీఈఓ డి.వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టి రాజు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి హౌసింగ్ పీడీ గణపతి రావు, ఇరిగేషన్ ఎస్ఈ డోల తిరుమల రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 32 వినతులు



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ డి.ప్రేమ్‌కాజల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి అర్జీదారుల నుంచి 32 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి అదనపు ఎస్పీ (అడ్మిన్) డి.ప్రేమ్ కాజల్ ఫిర్యాదులు అందుకుని వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎచ్చెర్ల మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జరుగుళ్ల శంకరరావు భార్య విజయకుమారి తన భర్తపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేసును ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్పీ బదులిచ్చారు.

నిర్జీవ శంఖారావం





నరసన్నపేటలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు (ఇన్‌సెట్లో) ప్రసంగిస్తున్న లోకేష్

- చప్పగా సాగిన లోకేష్ ప్రసంగాలు
- సభలకు స్పందన కరువు

నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సోమవారం జిల్లాలోని నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదావలసలో శంఖారావం కార్యక్రమాలు నిర్వహించారు. చప్పగా సాగిన ఆయన ప్రసంగాలు జనాల సహనానికి పరీక్ష పెట్టాయి. నరసన్నపేట మండలం జమ్ము వద్ద శంఖారావం పేరుతో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అయితే ఇక్కడ టీడీపీ అభ్యర్థిని ప్రకటిస్తారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి అనుయాయు లు భావించారు. కానీ ఆ ప్రస్తావన చేయకపోవడంతో నిరాశ చెందారు. తన కుమారుడు శ్రీనివాస్‌కు టీడీపీ నరసన్నపేట టిక్కెట్టు ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు ఉదయం లోకేష్‌ను టెంటులో కలిసినట్లు సమాచారం. సభలో జనాల కంటే ఖాళీ కుర్చీలే ఎక్కువగా కనిపించాయి.



ఆమదాలవలసలో పరిస్థితి

శ్రీకాకుళంలో జరిగిన శంఖారావంలో లోకేష్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ సీపీ నాయకులపై కక్ష సాధిస్తామని బహిరంగంగానే బెదిరించారు. ఇక్కడ శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మిదేవి, జనసేన ఇన్‌చార్జి కోరాడ సర్వేశ్వరరావు, ఎంపీ రామ్మోహన్ నాయుడు ప్రసంగిస్తుండగానే పలువురు మహిళలు ఇంటిదారి పట్టారు. ఈ సభకు శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఆశిస్తున్న గొండు శంకర్ పెద్ద ఎత్తున జన సమీకరణ జరిపారు. ఆయనకు సరైన గుర్తింపు ఇవ్వకపోవడం, ప్రసంగించేందుకు అవకాశం ఇవ్వకపోవడం, కనీసం పేరును కూడా ప్రస్తావించకపోవడంతో ఆయన అనుసరులు మనస్తాపం చెందారు. అనంతరం ఆమదాలవలస పట్టణంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సభ నిర్వహించి స్పీకర్‌పై విమర్శలు చేశారు. నాగావళి–వంశధార నదులను అనుసంధానం చేస్తానని ఆమదాలవలసకు పరిశ్రమలు తెచ్చి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని చెప్పారు. అయితే ఈ సభకు జనమే కరువయ్యారు. టీడీపీ హయాంలో మూతబడిన సుగర్ ఫ్యాక్టరీని మళ్లీ తెరిపిస్తామని హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందని ప్రజలు చర్చించుకున్నారు.

ఓటరు నమోదు పర్యవేక్షణకు..



శ్రీకాకుళం పాతబస్టాండ్: అధికారులు ఎన్నికల పనుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సరికి అన్ని పనులు పూర్తి చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వివిధ కమిటీలకు నోడల్ అధికారులను నియమిస్తున్నారు. ఇప్పటికే ఫిర్యాదుల మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. తాజాగా సోమవారం ఎలక్ట్రోల్ డిలీటెన్స్, అడిషన్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెల్‌లో కొత్త ఓటు దరఖాస్తులు పరిశీలించి ఓటు హక్కును కలిగించడం, తొలగించడం, వాటిపై పూర్తి స్థాయిలో విచారణ చేయించడం వంటివి ఉంటాయి. ఎన్నిక నామినేషన్ ప్రక్రియ పూర్తయిన చివరి రోజు వరకు ఓటుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నందున ఈ కమిటీకి ప్రాధాన్యత ఉంది. సెల్‌లో నోడల్ అధికారితో పాటు, రెండు నియోజకవర్గాలకు ఒకరు వంతున నలుగురు పర్యవేక్షణాధికారులు, వారికి తోడుగా 16 మంది సిబ్బందిని నియమించారు. జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఎస్.సుబ్బారావును నోడల్ అధికారిగా నియమించారు.

న్యూస్‌రీల్

రథసప్తమి చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా విజయరాజు



విజయరాజుకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: రథసప్తమి మహోత్సవ పర్యవేక్షణకు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ)గా దేవదాయ శాఖ ఇన్‌చార్జి రీజనల్ జాయింట్ కమిషనర్ ఎం.విజయరాజును నియమిస్తూ దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16న అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో జరుగుతున్న ఈ ఉత్సవ నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలన్నీ సీఎఫ్ఓగా విజయరాజు బాధ్యతలు చేపట్టనున్నారు.

అంధులకు ల్యాప్‌టాప్‌లు



ల్యాప్‌టాప్‌లను అంధులకు అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల శాఖ ఏర్పాటు చేసిన ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సోమవారం పలువురు అంధులకు అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు శాఖ ఏడీ కవిత పాల్గొన్నారు.

15న జాబ్‌మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మెగాజాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ పోస్టర్‌ను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్పందన హాల్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 13 స్థానిక, బహుళజాతి ప్రైవేట్ సంస్థలు పాల్గొననున్నాయి. టెన్త్ నుంచి పీజీ వరకు ఏదైనా విద్యార్హత కలిగిన యువత జాబ్‌మేళాకు తరలి రావాలని, వివరాల కోసం 9550967353, 8317652552 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షలో చినబడాం విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్



మల్లా ప్రణీత్ కుమార్

కాశీబుగ్గ: రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్ష ఈఈఎంటీ (ఎడ్యుకేషన్ ఎఫిషియన్సీ మెరిట్ టెస్ట్–2024)లో చినబడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి మల్లా ప్రణీత్ కుమార్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. రాష్ట్ర స్థాయి 10వ తరగతి విద్యార్థులకు రెండు స్థాయిల్లో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో సుమారు 9 వేల మంది విద్యార్థులు పాల్గొనగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చినబడాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మల్లా ప్రణీత్‌కుమార్ మొదటి ర్యాంకు సాధించి విజేతగా నిలిచాడు. విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుని ఉషారాణి, ఇతర పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

'విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేసుకునేందుకు తక్షణమే అవకాశం కల్పించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సంబంధిత శాఖాధిపతులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కేటాయింపుపై బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.అడ్డయ్యతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2021–22 డిగ్రీ విద్యార్థుల ఇంటర్న్ షిప్ కోసం ప్రభుత్వ శాఖాధిపతులకు కేటాయించిన విధంగా విద్యార్థులను తీసుకోవాలని ఆదేశించారు. 15వారాలు లాంగ్ టెర్మ్ ఇంటర్న్ షిప్ కోసం శాఖాధిపతులకు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం 5,445 మంది విద్యార్థులను 27 శాఖలకు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో 2,000 మంది సచివాలయాలకు, 1,770 మందికి విద్యాశాఖలో, 452 మందికి వైద్య, ఆరోగ్య శాఖకు అత్యధికంగా కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన శాఖలకు తక్కువగా ఉన్నారని, వీరందరికి గతంలో మాదిరిగానే ప్రొసీడింగ్స్ ఇచ్చి, ఆయా అధికారులకి సమాచారాన్ని అందజేయాలన్నారు. విద్యార్థులు వెళ్లాల్సిన అధికారి పేరు, ఫోన్ నంబర్లను విద్యార్థులకు అందజేయాలని అన్నారు. సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధిక, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, జిల్లా అటవీ శాఖ అధికారి నిషా కుమారి, జిల్లాపరిషత్ సీఈఓ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.మీనాక్షి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు,డీఆర్‌డీఏ పీడీ విద్యా సాగర్, సీటీఓ రాణి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళనలు

శ్రీకాకుళం, శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగ సంఘాల సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అన్నారు. సోమవారం జిల్లా ఎన్‌జీఓ హోమ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు ఎంతగానే సహకరిస్తున్నామని, న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ నాయకులు బడగల పూర్ణచంద్రరావు, రాయి వేణుగోపాల్, పూజారి జానకిరామ్, కె.రోజా, రాణి, బొత్స శ్రీనివాసరావు, అట్ల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు సోషల్ ఇంజినీర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులు సోషల్ ఇంజినీర్లని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీఆర్ లా కాలేజీ విద్యార్థులకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయం న్యాయ సేవా సదన్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాదిగా కొనసాగాలంటే ప్రతి నిత్యం విద్యార్థిగానే ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో న్యాయ విద్యార్థులు ఎంపీఆర్ లా కాలేజ్ కళాశాల ప్రిన్సిపల్ కే మోషే పాల్గొన్నారు.

విధుల్లో చేరిన క్రైమ్ అదనపు ఎస్పీ


అదనపు ఎస్పీ (క్రైమ్) ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్)గా బి.ఉమామహేశ్వరరావు జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1989 బ్యాచ్‌కు చెందిన వారు. ఎస్ఐగా తెలంగాణలో బాధ్యతలు చేపట్టిన ఈయన మండపేట, కైకలూరుల్లో సీఐగా చేశారు. అనంతరం విజిలెన్సు డీఎస్పీగా కృష్ణా జిల్లా నందిగామ, ఒంగోలులో, ఏసీబీ డీఎస్పీగా విజయవాడ చేస్తూ అటాచ్డ్‌గా ఎస్సీ, ఎస్టీ సెల్ ఏలూరు డీఎస్పీగా ఐదేళ్లకు పైగా కృష్ణా, ఏలూరు జిల్లాల్లో పనిచేశారు. బదిలీపై ఉద్యోగోన్నతిలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈయన స్వగ్రామం ఏలూరు.

విధుల్లో చేరిన ఎస్‌బీ, దిశ డీఎస్పీలు


ఎ.త్రినాథరావు (స్పెషల్‌బ్రాంచి)


ఆర్.శ్రీనివాసరావు (దిశా డీఎస్పీ)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖకు సంబంధించి స్పెషల్ బ్రాంచి, దిశా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీలు ఎ.త్రినాథరావు, ఆర్.శ్రీనివాసరావులు సోమవారం వారి వారి కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. డీఎస్పీ త్రినాథరావు 1989వ బ్యాచ్‌కు చెందినవారు. ఎస్ఐగా పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో మొదటి పోస్టింగ్‌లో చేరారు. అనంతరం 2004లో సీఐగా తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో, 2014లో రాజమండ్రి క్రైమ్ డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. చివరిసారిగా విశాఖపట్నం టాస్క్ ఫోర్సులో నాలుగున్నరేళ్లు చేసి ఇక్కడికి డీఎస్పీ బాలరాజు స్థానంలో బదిలీపై వచ్చారు. ఈయన స్వగ్రామం మచిలీపట్నం. అలాగే ఎస్.వాసుదేవ్ స్థానంలో జిల్లా దిశా డీఎస్పీగా వచ్చిన ఆర్.శ్రీనివాసరావు 1991 బ్యాచ్‌కు చెందినవారు. ఎస్ఐగా ప్రకాశం జిల్లాలో తొలిసారిగా చేశారు. 2014 లో తాడివాడిపల్లెలో సీఐగా, 2014లో ఎస్‌బీ డీఎస్పీగా ప్రకాశం జిల్లాలో ఉద్యోగోన్నతులు పొందారు. అనంతరం విజయవాడ ఎయిర్‌పోర్టు, ఇంటిలిజెన్సు, సీఐడీ డీఎస్పీలుగా చేసి చివరిసారిగా ఎస్సీ,ఎస్టీ సెల్ విజయనగరం డీఎస్పీ అటాచ్డ్ దిశా చేసి బదిలీపై శ్రీకాకుళం వచ్చారు. ఈయన స్వస్థలం గుంటూరు జిల్లా ఉంగుటూరు.

అప్రెంటిస్‌కు 47 మంది ఎంపిక


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో సోమవారం ఐటీఐ, ఇంటర్మీడియెట్ ఒకేషనల్ పూర్తి చేసిన వారికి అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో జిల్లాలోని ఎనిమిది కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 82 మంది హాజరు కాగా, వీరిలో నైపుణ్యం ఆధారంగా 47 మందిని ఎంపిక చేశారు. అనంతరం వీరికి నియామక పత్రాలు అందజేశారు. మేళాను ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐటీఐ పూర్తిచేసిన ప్రతి విద్యార్థి అప్రెంటిస్‌షిప్ చేయాలని సూచించారు.

తీరానికి చేరిన సముద్రపు తాబేళ్లు

వజ్రపుకొత్తూరు రూరల్/కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి సముద్ర తీరానికి ఐదు సముద్రపు తాబేళ్లు కొట్టుకు వచ్చాయి. అయితే ఇవన్నీ చనిపోయి ఉన్నాయి. భారీ ఆకారంలో ఉన్న ఈ తాబేళ్లు తాజాగా ఉండటంతో పర్యాటకులు చూసేందుకు ఆసక్తి చూపారు.

రథసప్తమి వేడుక

వైభవంగా నిర్వహిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహిద్దామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 16న జరగనున్న రథసప్తమి వేడుకల ఏర్పాట్లలో భాగంగా ఆయన సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యూలు, ప్రసాదాల పంపిణీ తదితర చర్యలు చేపట్టాలని, పాలు, బిస్కెట్లు, మంచినీరు అందించే ప్రక్రియ సజావుగా జరపాలని చెప్పారు. వైద్య శిబిరాల ఏర్పాటు, ఉచిత భోజనం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 15వ తేదీ అర్ధరాత్రి నుండి పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని, ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని పేర్కొన్నారు. రథసప్తమి దృష్ట్యా దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నిరంతరం విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలని అలాగే ముందస్తు జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, భక్తులకు నిరంతరం అందుబాటులో తాగునీరు అందించే చర్యలు చేపట్టాలని, వికలాంగులు, వృద్ధుల కోసం వీల్ చైర్స్ ఏర్పాటుచేసి అవి ఎక్కడ అందుబాటులో ఉన్నాయో తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రెవెన్యూ, దేవాదాయశాఖకు సంబంధించిన సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. 80 ఫీట్ రోడ్డులో భక్తుల వాహనాల పార్కింగ్‌కి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చూడాలని, పుష్కరిణి పరిసరాల్లో లైటింగ్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధిక, కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా, జిల్లా అటవీ శాఖాధికారిణి నిషాకుమారి, డీఆర్‌ఓ గణపతిరావు, ఆర్‌డీఓ సీహెచ్ రంగయ్య, ఎండోమెంట్ ఆర్‌జేసీ విజయకుమార్, సహాయ కమిషనర్ డీవీవీ ప్రసాద్ పట్నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, ట్రాఫిక్ సీఐ అవతారం పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


పది పరీక్షలపై మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా నుంచి 30,574 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అంతటా 145 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 7 ఫ్లయింగ్ స్క్వాడ్స్, చీఫ్ సూపరింటెండెంట్లు 145 మందిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని తెలిపారు. జిల్లా విద్యా శాఖ సహాయ కమిషనర్ లియాఖత్ అలీఖాన్ పరీక్షల నిర్వహణ వివరాలను తెలిపారు. సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధిక, డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

బాలలకు చేయూత


నగదును అందిస్తున్న దాతలు

పొందూరు: తల్లిదండ్రులను కోల్పోయిన బాలలకు దాతలు చేయూత అందిస్తున్నారు. 'సాక్షి'లో ఈ నెల 5న ప్రచురించిన 'తల్లిదండ్రులు దూరం భవిత భారం' కథనానికి స్పందించిన దాతలు బాలలకు సాయం అందజేస్తున్నారు. శ్రీకాకుళంలోని శాంతినికేతన్‌లో ఇంటర్ 1995–97 బ్యాచ్ సుమారు రూ. 25, 501, రాజాం పట్టుశాలీ సంక్షేమ సంఘం రూ. 10 వేలు, చదువుల ప్రసాద్ రూ. 2 వేలు, దున్న గగన్ రూ. 2వేలు, అల్లంశెట్టి సర్వోత్తమరావు రూ. 2 వేలు, చదువుల ప్రసాద్ రూ. 2వేలు, కోరుకొండ సునీల్ రూ. 2వేలు, గుంటుకు కృష్ణారావు రూ. 2వేలు తదితరులు సాయం అందజేశారు. సాయం అందజేసేందుకు 9912474529 నంబర్‌ను సంప్రదించాలని బాలలు కోరుతున్నారు.

నేడు ఆలయ పాలకమండలి సభ్యుల సమావేశం


డీఎల్‌వీ రమేష్‌బాబు, ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పాలకమండలి సభ్యుల సమావేశం మంగళవారం ఉదయం 10గంటలకు ఆలయంలోనే నిర్వహిస్తున్నట్లుగా ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉత్సవానికి తగిన ఏర్పాట్లు ఇతరత్రా దర్శన పాసుల జారీ తదితర అంశాలపై పాలకమండలి సభ్యులు చర్చించనున్నారు.

నేటి నుంచి దాతల పాసుల జారీ

ఆలయానికి రూ.లక్ష లేదా అంతకుమించిన విరాళాలను అందజేసిన దాతలకు ఈ నెల 13 నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు దాతల పాసులను జారీ చేస్తున్నామని ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్ బాబు తెలియజేశారు. ఈ మేరకు దాతలు తమ ధ్రువీకరణ ఆధారాలతో ఆలయ కార్యాలయానికి వచ్చి డోనర్ పాసులను తీసుకువెళ్లాలని ఆయన కోరారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం


రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగి వర్మ, ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం ప్రాణదానమని శ్రీకాకుళం ఆర్టీసీ రెండో డిపో మేనేజర్ కేఆర్ఎస్ శర్మ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శ్రీకాకుళం ఆర్టీసీ డిస్పెన్సరీ వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో శర్మ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్స్ అందజేశారు. రక్తదాన కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, శ్రీకాకుళం 1, 2వ డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, శ్రీకాకుళం 2వ డిపో అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) బి. చాణక్య, శ్రీకాకుళం 1, 2వ డిపోల ఆయిల్ ఈఇ లు శ్రీను, రమేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్. సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట (విశాఖపట్నం): ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫార్మసిస్టుల గ్రేడ్–2 నియామకాలకు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ బి.సుజాత (విశాఖ,జోన్) నోటిఫికేషన్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 8 ఫార్మసిస్టు గ్రేడ్–2 పోస్టులు భర్తీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ నెల 27వ తేదీ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఆమె తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను రేసవానిపాలెంలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు వారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు డి.ఫార్మా/బి.ఫార్మా ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. వివరాల కోసం https. nagendra svast.wordpress. com వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.500, మిగిలిన కులాలకు చెందిన అభ్యర్థులు రూ.300, డిమాండ్ డ్రాఫ్ట్ తీసి దరఖాస్తుకు జత చేయాలన్నారు. రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ, విశాఖపట్నం పేరిట డీడీ తీయాలని డాక్టర్ సుజాత తెలియజేశారు.

'కార్పొరేషన్లతో అభివృద్ధి సాధ్యం'


మాట్లాడుతున్న చైర్మన్ సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెనుకబడిన కులాల అభివృద్ధి కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో కళింగ వైశ్య, బేరి వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లతో 10వ బోర్డు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జీఓ 25 ప్రకారం బీసీల్లో రాష్ట్రమంతా చేర్పించడంపై కళింగ వైశ్యులు, బేరి వైశ్యులు రుణపడి ఉంటారన్నారు. దిగువ తిరుపతితో కళింగవైశ్యుల సత్రం ఏర్పాటుకి స్థలం కేటాయించినందుకు మంత్రి ధర్మాన ప్రసాదరావు, టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుతూ తిరుపతి వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలస గ్రామం సమీపంలో కింతలి–కనిమెట్ట రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మొదలవలస అప్పారావు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్వగ్రామం పొందూరు మండలం మొదలవలసకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో ఆయనకు దెబ్బలు తగిలాయి. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి తలకు గాయం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని జిల్లా పరిషత్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమైనట్లు ట్రాఫిక్ ఎస్ఐ పి.ప్రసాదరావు పేర్కొన్నారు. మంగువారితోట కామాక్షమ్మ వారి ఆలయం సమీపంలో నివాసముంటున్న దూపాన రమణ తల్లి సోమవారం జిల్లా పరిషత్ వైపు నడిచి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేటి నుంచి స్పాట్ వాల్యుయేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్ మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. పరీక్షల నిర్వహణ కేంద్రంలో సోమవారం వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఆరు మూల్యాంకన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషులు, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళలు, రాజాం జీసీఎస్ఆర్, శ్రీకాకుళం రూరల్ గాయత్రి కాలేజ్, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మూల్యాంకనం నిర్వహించనున్నట్లు చెప్పారు. త్వరితగతిన ఫలితాల విడుదల లక్ష్యమని చెప్పారు. డిగ్రీ ఆరో సెమిస్టర్‌కు సంబంధించి వర్సిటీ పరిధిలో 5444 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని అధికారులు ప్రభుత్వ శాఖలు కేటాయించనున్నారని పేర్కొన్నారు.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని అరసవల్లి సమీపంలో సోమవారం ఎదురుగా వస్తున్న ఆటోలు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ పి.ప్రసాదరావు చెప్పిన వివరాల మేరకు చిత్తూరు జిల్లా తిరుపతికి చెందిన కంచి అనంత్ గత కొంతకాలంగా విశాఖపట్నంలోని దాబా గార్డెన్‌లో బుల్లీస్ కాఫీ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం కోటబొమ్మాళిలో మిత్రుని వివాహం కోసం తన కస్టమర్ దున్న హేమంతరావుతో కలిసి వెళ్లాడు. శ్రీకాకుళంలోని శ్రీకూర్మం, అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయాలను దర్శించి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అనంత్, హేమంతరావులకు గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మత్తు వదిలిస్తాం..

- గంజాయి తదితర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం
- పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదుల పరిష్కారానికి కృషి
- అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా..
- విశాఖ రేంజ్ నూతన డీఐజీ విశాల్ గున్ని


విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన విశాల్ గున్ని

సాక్షి, విశాఖపట్నం: నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్)పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, దానికి అనుగుణంగానే తమ పనితీరు ఉంటుందని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని చెప్పారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని, అక్రమ రవాణాను నిర్మూలిస్తామని, ఏజెన్సీ ప్రాంత జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రేంజ్ పరిధిలోని 5 జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేంజ్ పరిధిలోని గల వివిధ జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి తమ శాఖలోని అన్ని విభాగాలను పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదు ఇచ్చిన వారందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకు వెళతామన్నారు. తాను అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, వార్తలు ప్రచురించే ముందు తనను లేదా ఎస్పీ స్థాయి అధికారులను సంప్రదించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు. సోషల్ మీడియాలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అవాస్తవాలను వార్తలుగా ప్రచురించడం రోజురోజుకు పెరుగుతోందని, ఈ కారణంగా ప్రజలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వార్త ప్రచురించే ముందు నిజనిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

తొలి పోస్టింగ్ నర్సీపట్నం ఏఎస్పీగా..

2010 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన విశాల్ గున్ని శిక్షణానంతరం నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీగా పనిచేశారు. 2013 నుంచి 2015 వరకు నర్సీపట్నం ఏఎస్పీగా చేసిన ఆయన పదోన్నతిపై ఓఎస్డీగా నియమితులయ్యారు. అనంతరం నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల ఎస్పీగా, గ్రేహౌండ్స్ ఎస్పీగా, విజయవాడ డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేశారు. విజయవాడ నుంచి పదోన్నతిపై విశాఖ రేంజ్ డీఐజీగా వచ్చారు.

రాత్రి పదిన్నర దాటాక అన్నీ బంద్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో రాత్రి పదిన్నర సమయం దాటితే అన్నీ ఇక బంద్ చేయాలంటూ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ ఆదేశాలతో ఈ నిర్ణయం అమలు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి పదిగంటల సమయంలో దుకాణాలను బంద్ చేయాలంటూ యజమానులకు చెప్పామన్నారు. అంతేకాక బార్‌అండ్ రెస్టారెంట్లు వారు 11 గంటలకల్లా మూసివేయాలని, మందుబాబుల ఆగడాలు ఆ సమయం దాటి కనిపిస్తే సహించేది లేదన్నారు. ఈ క్రమంలో నగరంలోని చినబొందిలీపురంలో యువకులు మద్యం సేవించి తిరుగుతుండగా హద్దు మీరి ప్రవర్తించరాదని హెచ్చరించారు. నగరంలో సరైన కారణం లేకుండా అర్ధరాత్రి 12 దాటి తిరిగినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కేసులు బుక్ చేస్తామన్నారు.

ప్రగతి పనులపై కలెక్టర్ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల అమలులో ఎలాంటి అలసత్వం చూపరాదని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లా అధికారులతో కలిసి సోమవారం మధ్యాహ్నం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, నవరత్నాలు పేదల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు, అసైన్డ్ భూములు, కోర్టు కేసులు తదితర అంశాలపై తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లా వ్యాప్తంగా 1.84 లక్షల కార్డుల పంపిణీ మాత్రమే జరిగిందని, ఇంకా మిగిలిన కార్డులు పంపిణీ చేయాల్సి ఉందని ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి త్వరితగతిన పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు జిల్లాలో ఇప్పటి వరకూ 22,081 మాత్రమే జరిగాయని ఇంకా మిగిలిన వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. సర్వర్ ఎర్రర్, మిస్ మ్యాచ్ లాంటి సాంకేతిక సమస్యలకు జిల్లా రిజిస్ట్రార్‌తో సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కుల్ని కల్పించడంలో భాగంగా 2003 జూలై 31కు ముందు కేటాయించిన భూములపై సర్వేను పూర్తి చేయాలని చెప్పారు. భూముల రికార్డులను క్రమబద్ధీకరించడంలో భాగంగా తహసీల్దార్లు ఇప్పటికే ఇంటి స్థలాలు, వ్యవసాయ సాగు కోసం ప్రభుత్వం కేటాయించిన భూములను సర్వే నంబర్ల వారీగా సర్వే చేశారని, ఇంకా పూర్తి చేయని తహసీల్దార్లు దీన్ని ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని అన్నారు. రీ సర్వే, డిజిటల్ సైన్, కోర్టు కేసులు తదితర అంశాలపై కూడా ఈ సందర్భంగా సమీక్ష చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల రేషనైజేషన్ డేటాను త్వరిత గతిన సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విద్యా సాగర్, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.